సాక్షి
వికారాబాద్

శుక్రవారం : 19 : జనవరి : 2024



ఆటలు నిల్..

విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడంతో ఇతరులతో స్నేహభావం పెరగడంతో పాటు శారీరక ఎదుగుదల ఉంటుంది. 8లో ▸



ఖజానా లూటీ

బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర ఖజానాను లూటీ చేశారని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆరోపించారు. 8లో ▸



లక్ష్యం.. శత శాతం

ఈ యేడు పదో తరగతి ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత రాబట్టడంపై విద్యాశాఖ దృష్టి సారించింది. 9లో ▸

న్యూస్‌రీల్

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా మాధవరెడ్డి నియామకం



వికారాబాద్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ బలోపేతమే లక్ష్యంగా ఆ అధిష్టానం పావులు కదుపుతోంది. అందులో భాగంగా తెలంగాణలోని పలు జిల్లాల అధ్యక్షులను మార్పు చేసింది. ఈ క్రమంలో బీజేపీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కె.మాధవరెడ్డిని నియమించింది. రాష్ట్ర బీజేపీ కార్యాలయం నుంచి గురువారం మాధవరెడ్డికి ఫోన్ ద్వారా శుభాకాంక్షలు అందినట్లు సమాచారం. మాధవరెడ్డి విద్యార్థి దశలోనే ఏబీవీపీలో పనిచేశారు. అంచలంచెలుగా ఎదిగి పార్టీలో పలు పదువులు చేపట్టిన మాధవరెడ్డికి తాజాగా జిల్లా అధ్యక్ష పదవి వరించింది.

నూతన అధ్యక్షుడికి సన్మానం

ధారూరు: వికారాబాద్ జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఎంపికైన మాధవరెడ్డిని గురువారం రాష్ట్ర బీజేవైఎం, మండల బీజేపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాధవరెడ్డికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. నూతన అధ్యక్షుడి నాయకత్వంలో పార్టీ బలోపేతం కోసం పనిచేస్తామని వారు పేర్కొన్నారు. రాష్ట్ర బీజేవైఎం కార్యదర్శి వివేకానంద రెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మనోహర్‌రెడ్డిని సన్మానించిన పంచాయతీ కార్యదర్శులు

తాండూరు రూరల్: సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు మండలంలోని 33 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన్ను కలిసి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, ప్రజలకు వారధిగా గ్రామాల్లో కార్యదర్శులు పనిచేయాలని సూచించారు. కార్యదర్శుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యేను సన్మానించిన వారిలో ఇస్మాయిల్, ఆనంద్‌రావు, కిష్టప్ప, మోన్యానాయక్, లాలప్ప, ఫక్రోజీ, అశోక్, భావని, రవి, బాలకృష్ణ ఉన్నారు.

పంచాయతీలకు పక్కా భవనాలు

జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్



చంద్రాయన్‌పల్లి పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్

మోమిన్‌పేట: పంచాయతీలకు పక్కా భవనాలు నిర్మిస్తామని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు బి.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని బాల్‌రెడ్డిగూడెం, వెల్‌చాల్, ఇజ్రాచిట్టంపల్లి, సయ్యద్ అల్లీపూర్, చంద్రాయన్‌పల్లి, అంరాధికుర్దు గ్రామాల్లో నిర్మించిన నూతన పంచాయితీ భవనాలను గురువారం ఎంపీపీ వసంతతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. 500 జనాభా ఉన్న ప్రతి గ్రామన్ని పంచాయతీగా ఏర్పాటు చేశామన్నారు. రూ.16లక్షల నిధులతో గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలను నిర్మించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చంద్రకళ, లక్ష్మమ్మ, కాశీరాం, సత్యనారాయణరెడ్డి, అంజయ్య, సునీత, ఎంపీడీఓ శైలజారెడ్డి, ఎఈఈ ప్రణీత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

కుల్కచర్ల: రైతులు యాసంగి పంటల వివరాలను తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. చౌడాపూర్ మండలం కొత్తపల్లిలో రైతులు వేసిన పంటలను గురువారం సర్వేనంబర్ల ఆధారంగా ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద యాసంగి పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. అధునాతన పద్ధతులు పాటించడం, పంటమార్పిడి వంటి విధానాలను అనుసరించాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారి విశ్వనాథ్, భావన, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హస్తవాసి ఎవరికో?

అధికార పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిపై ఉత్కంఠ

- సిట్టింగ్‌కే బీఆర్ఎస్ గ్రీన్‌సిగ్నల్
- బీజేపీ అభ్యర్థిగా 'కొండా' దాదాపు ఖరారు!
- ఫిబ్రవరి చివర్లో షెడ్యూల్ వస్తుందనే ఊహాగానాలు



వికారాబాద్: పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార పార్టీ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థిగా ఎవరిని ప్రకటిస్తుందనే అంశం ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి సెగ్మెంట్లు చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోకి రానుండగా కొడంగల్ సెగ్మెంట్ నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోకి రానుంది. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ.. సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డికి మరోమారు తమ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. మరో ప్రధాన పార్టీ అయిన బీజేపీ నుంచి ఈసారి ఆ పార్టీ సీనియర్ నేత భాస్కరయోగితో పాటు మాజీ ఎంపీపీ కొండా విశ్వేశ్వరరెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అయితే కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరు దాదాపు ఖరారయినట్టేనని ఆపార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో ఇప్పుడు అందరి దృష్టి అధికార కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే దానిపై పడింది. ఫిబ్రవరి మాసాంతం లోపు పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉండటంతో త్వరగా అభ్యర్థిని ఖరారు చేసి ఎన్నికల ప్రచారం మొదలుపెట్టాలని అధికార పార్టీ నేతలు భావిస్తున్నారు.

బలాబలాపై నేతల విశ్లేషణ..

ఈసారి పార్లమెంటు ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉండే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అందరికంటే ముందే బీఆర్ఎస్ తమ పార్టీ చేవెళ్ల అభ్యర్థిని ప్రకటించడంతో సదరు అభ్యర్థి ఇప్పటికే అనుచరగణంతో గ్రౌండ్ లెవల్ ప్రిపరేషన్ మొదలుపెట్టారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో తమ బలాబలాలు ఎంతనే దానిపై అన్ని పార్టీలు విశ్లేషించుకునే పనిలో నిమగ్నమయ్యాయి. వికారాబాద్, తాండూరు, పరిగి సెగ్మెంట్లలో గత పార్లమెంటు ఎన్నికలతో పాటు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకే మెజార్టీ ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్, బీజేపీకి ఈ మూడు సెగ్మెంట్లలో చాలా తక్కువ ఓట్లు పోలయ్యాయి. అయితే పార్లమెంట్ ఎన్నికలకు, అసెంబ్లీ ఎన్నికలకు చాలా తేడా ఉంటుందని జాతీయ పార్టీ అయిన తమకే ఓటర్లు బ్రహ్మరథం పడతారని బీజేపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవాన్ని చవిచూసిన బీఆర్ఎస్ పార్టీ ఈసారి ఎలాగైనా అత్యధిక ఎంపీ స్థానాలు గెలిచి తమ పార్టీ పని ఐపోలేదని నిరూపించాలని భావిస్తోంది. అయితే అధికారంలో ఉన్నప్పుడే ఓట్లపరంగా వెనుకబడిన బీఆర్ఎస్ ఇప్పుడు ఏమేరకు ఓట్లు రాబట్టగలుగుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

కాంగ్రెస్ అభ్యర్థి ఎవరు..?

రాష్ట్రంలో దాదాపు పదేళ్ల బీఆర్ఎస్ పాలన అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వికారాబాద్ జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలు తన ఖాతాలో వేసుకున్న విషయం తెలిసిందే. జిల్లాలోనే మెజార్టీ భాగం కవర్ అయ్యే చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థిగా ఆ పార్టీ ఎవరిని రంగంలోకి దింపనుందనేది ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది. ఆ పార్టీ నుంచి ప్రధానంగా రెండు, మూడు పేర్లు వినిపిస్తున్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనతో పాటు బీఆర్ఎస్‌లో జిల్లాస్థాయి పదవిలో కొనసాగుతున్న వ్యక్తి త్వరలో హస్తం గూటికి చేరి ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉంటారని ప్రచారం కూడా జరుగుతోంది. బీఆర్ఎస్‌కే చెందిన ఓ మాజీ మంత్రి కాంగ్రెస్‌లో చేరి చేవెళ్ల అభ్యర్థిగా బరిలో నిలుస్తారనే చర్చ కూడా ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. వీలైనంత త్వరగా ఎంపీ అభ్యర్థిని ప్రకటించి ప్రచార పర్వంలో దిగాలని అధికార పార్టీ నేతలు భావిస్తున్నారు.

'గణతంత్ర' ఏర్పాట్లు చేయండి

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ఈ యేడాది కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈమేరకు గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై గురువారం జిల్లా అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం రోజున కలెక్టరేట్‌లో శకటాల స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రొటోకాల్ ప్రకారం అందరినీ ఆహ్వానించాలని సూచించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేసేందుకు జాబితాను అందజేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారి, అధికారులు పాల్గొన్నారు.

20,21 తేదీల్లో స్పెషల్ డ్రైవ్

జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం ఒకప్రకటనలో తెలిపారు. ఈనెల 20, 21వ తేదీల్లో ఓటరు నమోదు కోసం స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. ఈ రెండు రోజుల్లో బూత్ స్థాయి అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితా, సంబంధిత ఫారాలు 6,7,8లతో ఉదయం 10 గంటల నుంచిఅందుబాటులో ఉండాలన్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదుతో పాటు సవరణలు, చిరునామా మార్పులు, చేర్పులతో పాటు ఇతర అభ్యంతరాలను స్వీకరిస్తారన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే జైలుకే..

- చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా ఛైర్మన్ వెంకటేశం
- ఆపరేషన్ స్మైల్ కింద 36 మంది బాలకార్మికులకు విముక్తి



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు

తాండూరు రూరల్: బాలలను పనిలో పెట్టుకునే యజమానులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వెంకటేశం హెచ్చరించారు. తాండూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఆపరేషన్ స్మైల్ కింద గురువారం బాలలను పనిలో పెట్టిన తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జనవరి 1వ తేదీ నుంచి 31 వరకు 'ఆపరేషన్ స్మైల్-10' కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం బాలకార్మికులను పని నుంచి విముక్తి కల్పించడమే అని అన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే తాండూరులో 36 మంది బాల కార్మికులను గుర్తించి వారికి విముక్తి కల్పించినట్లు చెప్పారు. అలాగే వారిని పనిలో పెట్టుకున్న ఏడు మంది యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు. తల్లిదండ్రుల కోరిక మేరకు పిల్లలను చదివిస్తామని కూడా అన్నారు. పిల్లలను పనిలో పెట్టొద్దని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్లు ప్రకాష్, సంగమేశ్వర్, లీగల్ అడ్వైజర్ నరేష్, ఎస్ఐ విమల, లేబర్ ఆఫీసర్ సిబ్బంది సంతోష్, కానిస్టేబుల్ బాల్‌రాజ్, బస్వరాజ్, శేఖర్, మమత తదితరులు ఉన్నారు.



మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న కోటాజీ, సభ్యులు

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి కోటాజీ

కుల్కచర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కోటాజీ అన్నారు. కుల్కచర్ల మండలం పటేల్‌చెరువు తండా పంచాయతీ అనుబంధ గ్రామం పోటిగడ్డ తండాలో 'సయోధ్య హోమ్ ఫర్ ఉమెన్ ఇన్ నీడ్' అనే స్వచ్ఛంద సంస్థ మరియు ఉషా ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గిరిజన మహిళలకు ఉచితంగా ఇస్తున్న కుట్టు మిషన్లపై శిక్షణ ముగింపు కార్యక్రమానికి గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఇతరులపై ఆధారపడకుండా ఇంటి వద్దనే ఉంటూ ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. శిక్షణ పొందిన 15మంది మహిళలకు కుట్టు మిషన్లను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, స్థానిక సర్పంచ్ శాంతిబాయి, స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్లు రాము, రాంచంద్రయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

- రంగారెడ్డి వ్యవసాయాధికారి గీతారెడ్డి

ఆమనగల్లు: ఫర్టిలైజర్స్, ఎరువుల షాపుల డీలర్లు ఎప్పటికప్పుడు స్టాకు వివరాలను ఈ పాస్‌లో నమోదు చేయాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి గీతా రెడ్డి సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపులను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. స్టాకులను పరిశీలించి యజమానులకు పలు సూచనలు చేశారు. ఫర్టిలైజర్స్, ఎరువుల షాపుల డీలర్లు ఈ పాస్‌ను అప్‌డేట్ చేయకపోవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. ఎరువుల స్టాక్ వచ్చిన సమయంలో వివరాలను ఈ పాస్‌లో నమోదు చేయాలని సూచించారు.

ఎన్నికల సన్నాహాలు షురూ..

- ఓటర్ల నమోదు, సవరణలకు ప్రత్యేక డ్రైవ్
- పోలింగ్ బూత్‌లను పరిశీలించిన అధికారులు
- పోలింగ్ డ్యూటీ కోసం ఉద్యోగుల వివరాల సేకరణ
- జిల్లాలో ఇప్పటివరకు 1,133 కేంద్రాల గుర్తింపు



ఓటరు సవరణలపై రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

పరిగి: లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు అధికారులు కసరత్తులు ప్రారంభించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఇప్పటికే నూతన ఓటర్ల చేర్పు, సవరణ కార్యక్రమాన్ని చేపట్టగా మరోవైపు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను ప్రకటించనున్న నేపథ్యంలో ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే సవరించుకునేందుకు అవకాశం కల్పించారు. అలాగే జాబితాలోని పేర్లలో తప్పులు, ఫొటో మార్పిడి, పుట్టిన తేదీ వివరాలను సరిచేసుకోవడం, పోలింగ్ కేంద్రాన్ని మార్పునకు దరఖాస్తు చేసుకోవడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. అలాగే ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. ఈనెల 20, 21న బూత్ స్థాయిలో అధికారులు ఓటర్ల అభ్యంతరాలు స్వీకరించడంతో పాటు కొత్త ఓటర్ల నమోదును చేపట్టనున్నారు. అలాగే ఈనెల 22వరకు ఆన్‌లైన్ ద్వారా అభ్యంతరాలను తెలిపేందుకు కూడా అవకాశం కల్పించింది. ఈ ప్రక్రియను పూర్తిచేసి వచ్చేనెల 8న ఓటర్ల తుదిజాబితాను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో 1,133 పోలింగ్ కేంద్రాలు..

లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో పరిగి, వికారాబాద్, తాండూర్ మూడు నియోజకవర్గాలు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి రాగా కొడంగల్ నియోజకవర్గం మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది. మొత్తం నాలుగు నియోజకవర్గాల్లో 1,133 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పరిగిలో 305, వికారాబాద్‌లో 284, కొడంగల్‌లో 275, తాండూ ర్‌లో 269 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అవసరం ఉంటే అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

పోలింగ్ సిబ్బంది వివరాల సేకరణపై దృష్టి..

ఎన్నికల ప్రక్రియలో ఎంతో కీలకమైన పోలింగ్ నిర్వహణకు అవసరమైన సిబ్బంది వివరాల సేకరణ కొనసాగుతోంది. జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమాచారాన్ని సేకరిస్తున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమాచారాన్ని పంపించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా శాఖల ఉన్నతాధికారులు ఉద్యోగుల వివరాలను కలెక్టర్‌కు పంపించే పనిలో నిమగ్నమయ్యారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారితో పాటు మరో ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించనున్నారు.

స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం



అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 20, 21న బీఎల్ఓలు అందుబాటులో ఉంటారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటరు కార్డులో ఏమైన తప్పులు ఉంటే వాటి సరవరణ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చు. అన్ని బూత్‌లను పరిశీలించి ఏర్పాట్లపై అధికారులను ఆదేశించాం. రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ఓటరు నమోదు, మార్పు చేర్పుల గురించి వివరిస్తున్నాం. 18 ఏళ్ల నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలి.

– విజయకుమారి, ఆర్డీఓ, వికారాబాద్

మేడారానికి ఉచిత ప్రయాణం

- మహిళలకు కొనసాగిస్తాం
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- మన్నెగూడలో ఆర్టీఏ కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

తుర్కయంజాల్: మేడారం సమ్మక్క సారక్క జాతరకు వెళ్లే మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగుతుందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మున్సిపల్ పరిధిలోని మన్నెగూడలో నూతనంగా నిర్మించిన ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ప్రతిపక్షాల నాయకులు ఆటో కార్మికులను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. మెట్రో ప్రారంభించిన సమయంలో.. ఓలా, ఊబర్ వంటి సంస్థల ప్రవేశంతో ఆటో కార్మికుల ఉపాధి తగ్గినప్పుడు ప్రశ్నించని వారు నేడు పనికట్టుకుని ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరి సలహాలు, సూచనలు స్వీకరించి ఆర్టీఏ సేవలను సులభతరం చేస్తామని తెలిపారు. అనంతరం రవాణా శాఖ రూపొందించిన రోడ్ సేఫ్టీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. సాగర్ హైవే నుంచి నేరుగా కార్యాలయానికి వచ్చేలా రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని కలెక్టర్ శశాంకను కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే పరిశీలించి రోడ్డు వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేశం, బొగ్గారపు దయానంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత, ఆర్‌అండ్‌బీ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కేఎస్ శ్రీనివాసరాజు, రవాణాశాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్, జిల్లా ఉప కమిషనర్ ఎం.ప్రవీణ్ రావు, ప్రాంతీయ రవాణా అధికారి రఘునందన్ గౌడ్, కౌన్సిలర్ మర్రి మాధవి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్ కుటుంబానికి రూ.40 లక్షల చెక్కు

- అందజేసిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

తాండూరు: రోడ్డు ప్రమాదంలో మరణించిన కండక్టర్ కుటుంబానికి గురువారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ రూ.40 లక్షల చెక్కు అందజేశారు. వివరాలు.. లక్ష్మణ్ తాండూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. హైదరాబాద్‌లోని హకీంపేట్‌లో గతేడాది జూన్ 22న జోనల్ స్టాఫ్ ట్రెనింగ్ కళాశాలలో కండక్టర్‌లకు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ కోసం తాండూరు నుంచి వెళ్లిన లక్ష్మణ్ నడుచుకుంటూ కళాశాల వైపు వెళ్తుండగా బైక్ ఢీకొన్న ప్రమాదంలో మరణించారు. దీంతో యూబీఐ శాలరీ సేవింగ్ అకౌంట్ ద్వారా బాధితుడి కుటుంబానికి రూ.40 లక్షల ఆర్థికసాయం చేసింది. ఈ చెక్కును లక్ష్మణ్ భార్య జ్యోతి, కుమారుడు అనిల్‌కుమార్‌కు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అందజేశారు. ఈడీ కృష్ణకాంత్, అధికారులు విజయపుష్ప, ఉషాదేవి, వెంకటేశ్వర్లు, అరుణ్‌కుమార్, రాజు ఉన్నారు.



లక్ష్మణ్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

క్లుప్తంగా

రేషన్‌ డీలర్‌ మృతి


గణపతి(ఫైల్‌)

మోమిన్‌పేట: మోమిన్‌పేట రేషన్‌ డీలర్‌ గణపతి(70) గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. రేషన్‌ డీలరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జూకరెడ్డి, మండలంలోని పలువురు డీలర్లు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి డీలర్ల సంఘం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు.

గంజాయి సాగు చేసిన వ్యక్తికి రిమాండ్‌

శంకర్‌పల్లి: గంజాయి మొక్కలు సాగు చేసిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. శంకర్‌పల్లి ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎల్వర్తి గ్రామానికి చెందిన తలారి ప్రేమ్‌ప్రసాద్‌ ఇంటి వద్ద గంజాయి మొక్కలు పెంచుతున్నాడని విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో అక్కడికి వెళ్లి పోలీసులు సోదాలు చేశారు. ఈ దాడుల్లో గంజాయి మొక్కలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ప్రేమ్‌ప్రసాద్‌ను రిమాండ్‌కు తరలించారు.

ఓటరు నమోదుకు అవకాశం

ఆర్డీఓ సూరజ్‌కుమార్‌

కందుకూరు: ఓటరుగా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేరును నమోదు చేయించుకోవాలని ఆర్డీఓ సూరజ్‌కుమార్‌ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. జనవరి 6 నుంచి 22 వరకు శని, ఆదివారాల్లో సైతం ఓటు హక్కు నమోదు చేసుకునేలా ఆయా గ్రామాల్లోని పోలింగ్‌ బూత్‌ల వద్ద బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఫారం-6 ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఫారం-7 ద్వారా తొలగింపు ఉంటుందన్నారు. ఫారం-8 ద్వారా తప్పులు సరిచేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌ ద్వారా సైతం ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 5,55,141 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 541 బూత్‌లలో 18 ఏళ్లు నిండిన వారు మూడు శాతం కొత్తగా నమోదు చేసుకోవాల్సి ఉండగా ఇప్పటి వరకు 2.6 శాతం మాత్రమే నమోదయిందన్నారు. సీనియర్‌ సిటిజన్లు 8,288, దివ్యాంగులు 8,350 మంది ఉన్నారన్నారు. ఓటరు నమోదుకు అందరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్‌ గోపాల్‌ పాల్గొన్నారు.

ఆటలు నిల్‌.. విద్యార్థులు డల్‌!

- నాలుగు గోడల మధ్య నలుగుతున్న బాల్యం
- ఐదేళ్లుగా క్రీడలకు దూరం
- కోవిడ్‌ కారణంగా నిలిచిన ఎస్‌జీఎఫ్‌ పోటీలు


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్‌)

దౌల్తాబాద్‌: విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో.. ఆటలు అంతే ప్రధానం. క్రీడాపోటీల్లో పాల్గొనడంతో పోటీతత్వం స్నేహభావం పెరగడంతో పాటు శారీరక మానసిక ఎదుగుదల ఉంటుందనేది కాదనలేని వాస్తవం. ఇదే విషయం ప్రజాప్రతినిధులు, అధికారులు అవకాశం దొరికినప్పుడల్లా చెబుతుంటారు. కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం అమలుకు చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థులు విద్యకే పరిమితం అవుతున్నారు. రోజంతా పుస్తకాలతో కుస్తీపడుతూ నాలుగు గోడల మధ్య నలిగిపోతున్నారు. ఐదేళ్లుగా మండల స్థాయిలో క్రీడాపోటీలు నిర్వహించడంలేదు. ఈ పోటీలు నిర్వహించడం వల్ల పాఠశాల స్థాయి నుంచి మండల స్థాయి, అక్కడి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటే అవకాశం ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన వారికి స్పోర్ట్స్‌ కోటా రిజర్వేషన్లు వర్తించే సర్టిఫికెట్లు జారీ చేస్తారు. కానీ కరోనా పుణ్యమా అని స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌(ఎస్‌జీఎఫ్‌) పోటీలు నిలిచిపోయాయి.

సత్తా చాటుతున్న గ్రామీణ క్రీడాకారులు

గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో సత్తాచాటే ఆసక్తి ఉన్నా ప్రోత్సహించేవారు కరువయ్యారు. ఐదేళ్ల క్రితం నిర్వహించిన మండల స్థాయి క్రీడాపోటీల్లో విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కానీ అధికారులు జిల్లా స్థాయి వరకు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. పాఠశాలల్లోనూ పీఈటీలు, పీడీ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఆటలకు విద్యార్థులకు దూరమయ్యారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

అవును.. పులే!

రేగడిమైలారం, కొత్తూరు శివార్ల మధ్య సంచారం..?


పులి కనిపించిందని చెబుతున్న ప్రదేశం

బొంరాస్‌పేట: 'అవును. పులిని కళ్లారా చూశా. ఉదయం కారులో వెళ్తుండగా మూడు గంతుల్లో జాతీయ రహదారిని దాటేసింది'. అంటూ మండల పరిధిలోని రేగడిమైలారానికి చెందిన బంటు హన్మంతు చెప్పాడు. రెండు నెలలుగా బొంరాస్‌పేట్‌, దుద్యాల మండలాల పరిధిలోని గ్రామాల్లో పులి సంచరిస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి. గురువారం మరోసారి పులిసంచారం విషయం చర్చనీయాంశమైంది. రేగడిమైలారం గ్రామానికి చెందిన బంటు హన్మంతు మరో వ్యక్తితో కలిసి కారులో హైదరాబాద్‌ వెళ్తున్నారు. జాతీయ రహదారి-163పై రేగడి మైలారం శివారు, కొత్తూరు శివార్ల మధ్య మంద మైసమ్మగుడి సమీపంలో మూడు గంటల్లో రోడ్డు దాటిందని చెప్పారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేకలు, గొర్రెల కాపర్లు, పంట కావలి చేసే రైతులు, ద్విచక్రవాహనదారులను అధికారులు అప్రమత్తం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్‌ బియ్యం సీజ్‌


బియ్యం పట్టుకున్న టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు

తాండూరు టౌన్‌: అక్రమంగా నిల్వ ఉంచిన 23 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు సీజ్‌ చేశారు. టాస్క్‌ ఫోర్స్‌ ఎస్‌ఐ ప్రశాంత్‌వర్ధన్‌ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని ముర్షద్‌ దర్గా సమీపంలోని ఓ ఇంట్లో 15 క్వింటాళ్లు, ఎన్టీఆర్‌ కాలనీ సమీపంలోని ఓ గోదాంలో నిల్వ ఉంచిన ఎనిమిది కింటాళ్ల రేషన్‌ బియ్యం నిల్వ ఉంచినట్లు వారికి విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు దాడి చేసి రేషన్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్‌ బియ్యాన్ని నిల్వ ఉంచిన ఎండి.టిప్పుసుల్తాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బుక్‌ కీపర్‌పై అధికారుల విచారణ


బుక్‌ కీపర్‌పై విచారణ చేపడుతున్న ఏపీఎం సురేశ్‌

- తప్పును ఒప్పుకొన్న మల్లేశం
- ఫిబ్రవరి 1 వరకు డబ్బు చెల్లించేందుకు ఒప్పందం

దోమ: మహిళా సంఘం నుంచి డబ్బులు కాజేసిన బుక్‌ కీపర్‌పై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. గురువారం «సాక్షి» దినపత్రికలో బుక్‌ కీపర్‌ చేతివాటం అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు ఏపీఎం సురేశ్‌ను బుక్‌ కీపర్‌పై విచారణ చేపట్టేందుకు మోత్కూర్‌ గ్రామానికి వెళ్లి గ్రామ సంఘం సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. డబ్బు ఎలా కాజేశాడో పూర్తి స్థాయిలో రికార్డులను పరిశీలించారని కోరారు. శివశ్రీ మహిళా సంఘానికి సంబంధించి గ్రామానికి చెందిన మల్లేశం గ్రామ సంఘం సహాయకుడికి విధులు నిర్వహిస్తున్నాడు. 2022 ఆగస్టు 30న రూ.7.50లక్షలు బ్యాంకులో రుణం ఇప్పించేందుకు సదరు మహిళా సంఘం సభ్యులను తీసుకెళ్లాడు. సభ్యులను మభ్యపెట్టి రూ.7.50లక్షల రుణం నుంచి రూ.5 లక్షలు వారి ఖాతాలో వేయించాడు. మిగిలిన డబ్బు మీ ఖాతాల్లో ఉంటుందని నమ్మించాడు. సదరు సభ్యులు అనుమానంతో బ్యాంకు నుంచి స్టేట్‌మెంట్‌ కోరగా రూ.2.50లక్షలు బుక్‌కీపర్‌ భార్య రజిత అకౌంట్‌లోకి బదిలీ చేసినట్లు గురువారం గుర్తించారు. డబ్బులను చెల్లించాలని బుక్‌కీపర్‌ను కోరగా రూ.10వేలు మహిళా సంఘం సభ్యులకు ఇచ్చాడు. ఫిబ్రవరి 1 వరకు మిగిలిన డబ్బు ఇస్తానని బుక్‌కీపర్‌ చెప్పాడని ఏపీఎం వెల్లడించారు. డబ్బు ఇవ్వకుంటే తన ఇంటిని స్వాధీనం చేసుకోవచ్చునని మహిళా సంఘం సభ్యులకు బాండ్‌ రాసి ఇచ్చాడని ఏపీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ నారాయణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, అకౌంటెంట్‌ మంజుల, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో ఖజానా లూటీ

- అయినప్పటికీ హామీలన్నీ అమలు చేస్తాం
- అవినీతి రహిత ప్రజాపాలన అందిస్తాం
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్‌: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో అప్పటి పాలకులు రాష్ట్ర ఖజానాను లూటీ చేశారని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం మండల పరిధిలోని ఇస్మాయిల్‌పూర్‌, నీళ్లపల్లి, జలాల్‌పూర్‌, మర్పల్లి, పర్వత్‌పల్లి, హంరక్యానాయక్‌తండా, బోజ్యానాయక్‌తండా, నవల్గా, గొట్టిగఖుర్దు, గొట్టిగకలాన్‌, బాద్లాపూర్‌, బాద్లాపూర్‌తండా, కుప్పన్‌కోట్‌, కాశీంపూర్‌ గ్రామాల్లో పర్యటించి ప్రజాసమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ పాలనలో వారికి కావాల్సిన వారికి ప్రభుత్వ ధనాన్ని దోచిపెట్టారని ఆరోపించారు. ప్రాజెక్టులు, స్కీముల్లో భారీ అవినీతికి పాల్పడ్డారని, విచారణలో అన్ని బట్టబయలవుతాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అవినీతి లేని ప్రజాపాలన అందిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు అమలు చేస్తున్నామని, త్వరలోనే మిగిలిన హామీలు అమలు చేస్తామన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు పెట్టుకున్న అర్హులందరికీ పథకాలు అందజేస్తామని అన్నారు. తాండూరు నియోజకవర్గంలో 7వ హామీగా కబ్జాలులేకుండా, స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునేలా చేస్తామని, ఇసుక అక్రమ రవాణాలను అరికడుతామని అన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు, పార్టీ శ్రేణులకు రుణపడి ఉంటానన్నారు. ముఖ్యమంత్రి ఆశీర్వాదంతో తాండూరును అభివృద్ధిలో మోడల్‌గా నిలుపుతానని మాటిచ్చారు. ఆయా గ్రామాల్లో కాంగ్రెస్‌ జెండావిష్కరణలు చేసిన ఎమ్మెల్యేకు పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ చైర్మన్‌ అజయ్‌ప్రసాద్‌, సీనియర్‌ నాయకుడు వెంకటేశ్‌ మహరాజ్‌, పార్టీ మండల అధ్యక్షుడు కలాల్‌ నర్సింలు, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ లక్ష్మణ్‌రావు, సీనియర్‌ నాయకులు సత్యనారాయణరెడ్డిచ, శంకరప్ప, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆధార్‌ అప్‌డేట్‌కు ఇదీ 'వరుస'


టోకెన్ల కోసం చెప్పుల క్యూ

యాచారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అర్హత కోసం ఆధార్‌ తప్పనిసరి. ఏళ్ల క్రితం నమోదు చేసుకున్న లబ్ధిదారులకు ప్రస్తుతం అప్‌డేట్‌ లేదు. ప్రస్తుతం అప్‌డేట్‌ ఉన్నవారికి మాత్రమే రేషన్‌ సరుకులు అందుతున్నాయి. ఆధార్‌ నంబర్‌ తీసుకున్న చిన్నారులకు అప్పట్లో బయోమెట్రిక్‌ లేదు. దీంతో ప్రస్తుతం వారంతా బయోమెట్రిక్‌ అప్‌డేట్‌ కోసం ఆధార్‌ కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. మండల కేంద్రంలో ఉన్న రెండు ఆధార్‌ సెంటర్లకు మండల పరిధిలోని గ్రామాలతో పాటు మంచాల, కందుకూరు, మాడ్గుల, ఇబ్రహీంపట్నం, నల్లగొండ జిల్లాలోని చింతపల్లి, మర్రిగూడ మండలాల ప్రజలు సైతం వస్తున్నారు. ఉదయం 4గంటల నుంచే ఆధార్‌ సెంటర్ల వద్దకు వచ్చి చెప్పులను క్యూలో పెడుతున్నారు. ఆ క్యూ ఆధారంగా సెంటర్‌ నిర్వాహకులు వారికి టోకెన్లు ఇచ్చి అప్‌డేట్‌కు వివరాలు సేకరిస్తున్నారు. ఈ కేంద్రాలకు నిత్యం ఐదు వందల మందికి పైగా వస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

రెండు రోజులుగా పల్లెల్లో పర్యటిస్తున్న అధికారులు


ఓ గ్రామంలో పర్యటిస్తున్న అధికారులు

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల అభివృద్ధికి అధికారులు శ్రీకారం చుట్టారు. రెండు రోజులుగా దుద్యాల మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ రాజ్‌ అధికారులు పర్యటించారు. గురువారం ఆలీడు, కుదరుమళ్ల, సంగాయిపల్లి, హకీంపేట, పోలెపల్లి, చెట్టుపల్లితండా, రాత్రి నాజ్‌ఖాన్‌పల్లి గ్రామాల్లో అధికారులు పర్యటించి ప్రణాళికలు సిద్ధం చేశారు. గ్రామాల్లో అవసరమైన అనుసంధాన రోడ్లు, అంతర్గత రోడ్లు, మురుగుకాల్వలు నిర్మాణానికి పరిశీలించారు. అలాగే బీసీ, ఎస్సీ, కమ్యూనిటీ హాళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేశారు. పంచాయతీరాజ్‌ శాఖ డీఈ సుదర్శన్‌రెడ్డి, ఏఈ మణికంఠతోపాటు కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖరయ్య గ్రామాల్లో పర్యటించారు. అధికారుల వెంట పార్టీ మండల నాయకులు వెంకటయ్య, కృష్ణ, సంజీవరెడ్డి, నర్సిరెడ్డి తదితరులున్నారు.

కుక్కిందవాసుల హరినామ సంకీర్తనం

టీటీడీలో గీతాలాపన చేసిన ఆంజనేయ భజన మండలి సభ్యులు



హాజరైన ఆంజనేయ భజన మండలి బృందం

ధారూరు: తిరుమల తిరుపతి దేవస్థానంలో వేంకటేశ్వరస్వామి సన్నిధానంలో నిర్వహించే హరినామ సంకీర్తనల్లో ఆంజనేయ భజన మండలి భక్తబృందం పాల్గొంది. టీటీడీ ఆహ్వానం మేరకు వారు గురువారం అఖండ హరినామ సంకీర్తనల్లో పాల్గొన్నారు. భక్తిగీతాలతో భక్తులను పారవశ్యంలో ముంచెత్తారు. అనంతరం వారికి దేవస్థానం వారు ఉచిత దర్శనం, వసతి కల్పించి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి సన్నిధిలో పాడే అవకాశం రావడం, అక్కడికి వెళ్లి హరినామ సంకీర్తనలు ఆలపించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అనంతయ్య, సుధాకర్‌, నందు, శ్రీనివాస్‌, ఆత్మలింగ యాదయ్య, బీరప్ప, బాల్‌రాజ్‌, వెంకటేశ్‌, సంగయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మినీ అంబులెన్స్‌కు ఎమ్మెల్యే స్టిక్కర్‌


మినీ అంబులెన్స్‌కు స్టిక్కర్‌ను ఏర్పాటు చేయిస్తున్న కాంగ్రెస్‌ నేతలు

కుల్కచర్ల: ప్రస్తుత పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి 2014లో శాసనసభ్యుడిగా ఉన్న సమయంలో ఎమ్మెల్యే నిధుల నుంచి మినీ అంబులెన్స్‌ అందించారు. కుల్కచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఈ అంబులెన్స్‌కు ఆయన ఓటమి తర్వాత వాహనంపై ఆయన ఫొటో, వివరాల స్టిక్కర్‌ను తొలగించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌ నేతలు ఆరోగ్యశాఖ అధికారులకు విషయం వివరించారు. అనంతరం గురువారం ఆ వాహనానికి ఎమ్మెల్యే టీఆర్‌ఆర్‌ ఫొటో వివరాల స్టిక్కర్‌ను వాహనంపై అంటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షులు ఆంజనేయులు, కమ్యూనిటీ హెల్త్‌ ఆఫీసర్‌ చంద్రప్రకాశ్‌, నాయకులు పులింగ చిన్న వెంకటేశ్‌, కృష్ణయ్య, చంద్రయ్య, భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు అభినందనీయం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ ఆనంద్‌


ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ తదితరులు

మోమిన్‌పేట: గ్రామీణ ప్రాంత ప్రజలకు గుండె సంబంధిత వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడం అభినందనీయమని వికారాబాద్‌ మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ మెతుకు ఆనంద్‌ అన్నారు. గురువారం మండల పరిధిలోని కేసారంలో హైదరాబాద్‌కు చెదిన రెనోవా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆనంద్‌ మాట్లాడుతూ.. గ్రామీణులు వైద్యంపై నిర్లక్ష్యం చేయకుండా శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. సాధారణ వైద్య పరీక్షలతో పాటు ఈసీజీ, 2-డీ ఎకో, బీఎండీ, షుగర్‌, బీపీ వంటి పరీక్షలు నిర్వహించి సూచనలు చేస్తారన్నారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసిన ఆస్పత్రి యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ చంద్రకళ, దబ్బని వెంకట్‌, వైద్యులు పద్మావతికపిల, మహ్మద్‌ ఆరిఫ్‌, సయ్యద్‌ జైనుద్దీన్‌, ఫరీద్‌, జహీర్‌, రఘుమోహన్‌, మోసిన్‌, సుభాన్‌ఖాన్‌ తదితరులున్నారు.

ప్రియుడిని ప్రేరేపించి.. భర్తను హతమార్చి

- కొండారెడ్డిపల్లిలో దారుణం
- కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుల రిమాండ్‌

కేశంపేట: వివాహేతర సంబంధం ఓ వ్యక్తిని బలి తీసుకుంది. భార్య ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన సంఘటన మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మిద్దె యాదగిరి ఈ నెల 13న అనుమానాస్పదంగా మృతి చెందారు. అదే రోజు ఆయన తల్లి అమృత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సమగ్ర దర్యాప్తు చేసి గురువారం నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన యాదగిరి వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామంలో బోరు బండిపై కూలీ పనిచేసేవారు. ఈ నెల 8న గ్రామానికి వస్తున్నట్లు ఆయన భార్య శివలీలకు ఫోన్‌లో తెలిపారు. అప్పటికే వివాహేతర సంబంధం సాగిస్తున్న ఆమె ప్రియుడు ఆంజనేయులుకు సమాచారం ఇచ్చింది. తన భర్తను హత్య చేయాలని ఆమె కోరింది. ప్రియుడు షాద్‌నగర్‌లో యాదగిరిని కలుసుకొని.. ఇద్దరూ కొండారెడ్డిపల్లి చెరువు వద్దకు వచ్చి మద్యం తాగారు. ఇదే అదునుగా భావించి బండరాయితో యాదగిరిని కొట్టి చంపాడు. మూడు రోజుల్లోనే నిందితులను గుర్తించి కేసును ఛేదించడంతో పోలీసు ఉన్నతాధికారులు సీఐ రామిరెడ్డి, ఎస్‌ఐ వరప్రసాద్‌, క్రైమ్‌ కానిస్టేబుల్‌ శివకుమార్‌, రవి, అశోక్‌కుమార్‌రెడ్డిని అభినందించారు.

ఇసుక రవాణాకు వే బిల్‌ తప్పనిసరి


కాగ్నానది పరిరక్షణపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, డీఎస్పీ శేఖర్‌గౌడ్‌

- లేదంటే చర్యలు తప్పవు
- తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

తాండూరు: రెవెన్యూ అధికారులు జారీ చేసిన వే బిల్‌ ఉంటేనే ఇసుక రవాణా చేయాలని తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో కాగ్నానది పరిరక్షణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎస్పీ శేఖర్‌గౌడ్‌, మైనింగ్‌ ఏడీ శ్యామ్యూల్‌ జాకబ్‌, రూరల్‌ సీఐ రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అక్రమంగా తరలించే వారిపై క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఇసుక అవసరమైన వారు రూ.600 డీడీ చెల్లించాలన్నారు. కాగ్నా నుంచి ఇసుక తరలించేందుకు ఐదు రీచ్‌లకు అనుమతులిచ్చామని చెప్పారు. రెవెన్యూ, పోలీస్‌, మైన్స్‌ అధికారులు గుర్తించిన రీచ్‌ల నుంచే ఇసుక తీసుకెళ్లాలన్నారు. పాత తాండూరు, వీర్‌శెట్టిపల్లి, ఖాంజాపూర్‌, బషీరాబాద్‌ మండలంలోని నావంద్గి, పెద్దేముల్‌ మండలంలోని రేగొండి గ్రామ శివారులో ఉన్న కాగ్నానది నుంచి ఇసుక తరలింపునకు అనుమతులు ఇచ్చామన్నారు. ఇంటి నిర్మాణాలు చేపడుతున్న వారు అక్రమార్కుల అండతో ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేయడంతో పాటు ఇసుక సీజ్‌ చేస్తామన్నారు. తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్‌ మాట్లాడుతూ.. తాండూరు సబ్‌ డివిజన్‌ పరిధిలో ఇసుక అక్రమ రవాణ చేస్తే వాహనాలను సీజ్‌ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామన్నారు. ఇసుక ట్రాక్టర్‌లలో తరలిస్తున్న సమయంలో అధికారులు జారీ చేసిన వే బిల్లులను తప్పక దగ్గర ఉంచుకోవాలన్నారు. లేదంటే కేసు నమోదు చేస్తామన్నారు.

సైన్స్‌ టాలెంట్‌ టెస్టుతో సృజనాత్మకత

షాద్‌నగర్‌రూరల్‌: శాస్త్రీయ ఆలోచనలను కలిగించే సైన్స్‌ టాలెంట్‌ టెస్టులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని జియోన్‌ పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో సైన్స్‌ టాలెంట్‌ టెస్టు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సైన్స్‌ టాలెంట్‌ టెస్టులు విద్యార్థుల మేధోశక్తిని పెంపొందిస్తాయన్నారు. ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. మెరుగైన ఆలోచనలు, పరిశీలన, ఆసక్తిని రేకెత్తించడానికి వైజ్ఞానిక పరీక్షలు ఎంతో దోహదపడుతాయన్నారు. ఈ నెల 19న పాఠశాల స్థాయిలో, 27న మండల, ఫిబ్రవరి 3న జిల్లా స్థాయిలో నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభను చాటాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ డివిజన్‌ అధ్యక్షుడు కుర్మయ్య, ప్రధాన కార్యదర్శి నర్సింలు, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యాటక క్షేత్రంగా జేపీదర్గా

కొత్తూరు: మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలోని జేపీదర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో గంధోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌, వక్ఫ్‌బోర్డు అధికారులతో కలిసి బాబాకు గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన జేపీదర్గాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం దర్గా అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. గతంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం దర్గా ఆవరణలో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించలేకపోయిందని విమర్శించారు. తమ ప్రభుత్వంలో దర్గాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. బాబా దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారికి అన్ని రకాల సౌకర్యాలు, వసతులు కల్పించనున్నట్లు తెలిపారు.